# విలోమ కథలు

# ఇందుమూలముగా సమస్తమైనవారికీ
# మన ముఖాలూ కాళ్లూ చేతులూ వగైరా
# సర్వాంగాలను గురించీ
# తెలియజేయడ మేమనగా ....

నగ్నముని

ఎందుకన్నా మంచిది చివర్న కాక యీ కథలోని నీతి ముందే చెప్పేయడం మంచిది. ఎందుకంటే యీ కథకి స్వంత కాళ్ళూ, స్వంత చేతులూ, స్వంత మెదడూ లేవు. అందుకని కంచికి కాదుగదా కంచె వరకు కూడా చేరలేదు. మన స్వంత బుజాలమీద మన స్వంత తలకాయ వుండడం లేదని, మన చేతులూ, చేతలూ మనవి కావనీ, మనం మనంగాక మరొకళ్లంగా జీవితాంతం బతికేస్తున్నామనీ నాకు ప్రతి క్షణం అనిపిస్తోంది. మన స్వంత అవయవాల స్థానంలో మరొకళ్ళ అవయవాలు చోటుచేసుకొనే సమయంలో వచ్చే సంఘర్షణ మనల్ని అడ్డగాడిదల్ని చేస్తోంది. ఎవడి సొంత తలకాయతో, అవయవాల్తో వాడు బతికితే ఏ గోలా వుండదు. అది మనిషి కావచ్చు, దేశం కావచ్చు, అదీ కథ. ఇంక మీ ఇష్టం. మిగతాది చదివినా సరే, మానేసినా సరే. మీ సొంద నిర్ణయం మీరు తీసుకోవచ్చు.

మనలో చాలామందికి బతకడానికి ఒకటే ఉద్యోగం. మా ఆఫీసర్ గారికి మాత్రం రెండుద్యోగాలు. ఒకటి ఇంట్లో పెళ్లాంగానూ, రెండోది ఆఫీసులో మాకు మొగుడిగాను. ఆయనకి ఉద్యోగవిజయాల పద్యాలంటే ఇష్టమేగానీ, ఆఫీసులో యమధర్మరాజు ఏకపాత్రాభినయమంటే మరీ ఇష్టం. ఆ ఉదయం నేను కనబడగానే ఆఫీసు యినస్పెక్షన్ పని మీద అర్జెంటుగా బెజవాడ పొమ్మని తోలేశాడు. నే వెళ్ళి అక్కడివాళ్ళు గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడుతున్నారో తనిఖీ చెయ్యలన్న మాట. మా వాడికి బుద్ధిలేదు. గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడతారు? స్వంత డబ్బులాగ స్వంతానికి ఖర్చుపెట్టుకుంటారు. దానికి తనిఖీదేనికి? అదో దండగ.

సరే పెళ్ళిళ్ళ సీజను. రైల్లోనూ, బస్సుల్లోనూ టికెట్లు లేవు. సంచీ పుచ్చుకుని, బిక్క మొగం వేసుకుని లారీలు ఆగేచోట నుంచున్నాను – తారకమంత్రం సడెన్‌గా మర్చిపోయిన నారదుల్లా. అదేంమాయో

ఆవేళ లారీలు కూడా ఆ దార్లో కనబడలేదు. ఎక్కడ యాక్సిడెంట్లు చేయడానికి పోయాయో! ఎట్లారానాయనా అని వంటికి చెమట్లుపడుతున్న సమయంలో అదృష్టవశాత్తూ బెజవాడ పోతున్న దున్నపోతొకటి కనబడింది. దాని కాళ్లూ, తోకా పట్టుకొని, బతిమాలి, ఎదురుగావున్న హోటల్‌కి తీసికెళ్ళి కాస్త ఎండుగడ్డీ, కుడితీ సమర్పించుకుని, కొమ్ముకి సంచీ తగిలించి దానిమీదెక్కాను, దున్నపోతు అంతకుముందే మందు మీదున్నట్టుంది. హుషారుగా ఈలవేస్తూ సాగించింది ప్రయాణం, మందుమీద దున్నపోతు, దానిమీద నేను బస్సుకంటే ముందరే చేరుకున్నాం బెజవాడ.

దున్నపోతుమీద పోవడంచేత కాబోలు ఆఫీసు పని, మిగతా సొంతపనులన్నీ చక చకా సజావుగా సాగిపోయినై. స్టేషన్ కొచ్చి టిక్కెట్టు తీసుకున్నాక తెలిసింది. రైలు ఒక పూట లేటుగా వస్తుందని. ఈలోగా బయట కొచ్చి పేవ్‌మెంట్ మీద తెలుగు సినిమా పాటల పుస్తకాలు కొనుక్కున్నాను. సర్దాగా కాసిని రెండర్థాల బూతు పాటలు చదువుకుంటూ ప్లాట్‌ఫాం మీద గడిపేద్దామని, పాటల్తో బాటు ముంతమషాలా పొట్లాలు కాసిని కట్టించుకుని బెంచీమీద బైఠాయించాను. ఇంక నన్ను జయించేవాడు లేడు.

ఒక పూట ఆ విధంగా గడిచాక, లౌడ్‌స్పీకర్లో ఎనౌన్సర్ "రైలొచ్చిందోయ్ మామ రైలొచ్చిందోయ్" అని పాడింది. కుమ్ముకుని కూచున్నాంగాని, రైలు మాత్రం వానపాములా ప్లాట్‌ఫాంమీద పడుకుండి పోయింది. ఎంతకీ కదలదు. నీళ్ళు పట్టాడు, కదల్లేదు రైలు. ఎవరో ప్రజా ప్రతినిధి సలహా ఇస్తే మందుపట్టారు. తాగింది కానీ కదల్లేదు రైలు. చల్లగా చెప్పారు ఇంజన్ చెడిపోయిందని. డ్రైవరు, గార్డు, స్టేషన్ మాస్టరు తెలివైన వాళ్ళవడంవల్ల బతికిపోయాం. రైలుకి అటూ ఇటూ ఇనుప గొలుసులు కట్టి రాదారి పడవలా రైల్వే కూలీల్తో లాగించారు. ఒక బొజ్జాయన నా మీదా, నేను మరొకాయన మీదా అయన ఇంకొకాయన మీదా పడి గుర్రు పెట్టి ఒక కునుకు తీసేప్పటికి మా ఇల్లొచ్చేసింది.

ఇనస్పెక్షన్ కెళ్లొచ్చినా, ఖాళీ జేబుల్తో తిరిగొచ్చిన మొగుణ్ణి చూసి మా ఇంటావిడ ఇంట్లో ఏమేం నిండుకున్నాయో, ఈలోగా ఎంతమంది బంధువర్గం ఇంటిమీద దండయాత్ర చేసిందో దండకం చదివి, నాశక్తి సామర్థ్యాలకి బహుమతిగా బాత్రూం తడిక పక్కన కాస్త పసుపుముద్దపెట్టి బాల్చీలోకి వేణ్ణీళ్లు తోడింది. కుంభమేళాకెళ్ళి కమండలం పారేసుకొచ్చిన సాధువులా ఫీలయి, ఆఫీసుకి పారిపోవడానికి అవసరమైన ప్రయత్నాల్లోపడ్డాను.

గబగబా లుంగీ లుంగచుట్టుకుని, మంగలిపొది బయటికి తీసి, గడ్డానికి సబ్బెక్కించి రేజర్ పట్టుకుని అద్దంలోకి చూశాను. అంతే–గజ్జల్లో తేలు కుట్టినట్టయింది. అద్దంలో నాముఖం కనబడ్డం లేదు. నీళ్ళతోనూ, గుడ్డతోనూ అద్దాన్ని శుభ్రంగా తుడిచి మళ్ళీ చూశాను. ఉహూ–అద్దంలో మెడ వరకూ తప్ప నా ముఖం మాత్రం కనపడ్డంలేదు. ఇలా ఎంతకాలంగా జరుగుతోందో. అసలు ఎంతకాలంగా నాకు ముఖం లేకుండా పోయిందో ఇంతకాలం గమనించనందుకు తిట్టుకుని, ఇప్పుడేముఖం పెట్టుకుని ఆఫీసుకెళ్లాలిరా నాయనా అని అన్ని రాగాల్లోనూ ఏడ్చి, ఏంచేయాలో తోచక ఆవేళ్టికి మాత్రం తనముఖం అరువివ్వమని మా ఆవిడ్ని బతిమాలుకుని, ఆవిడ ముఖం తగిలించుకున్నాను. 'ఎవరన్నా నవ్వుతారేమోనండీ' అని ఆవిడ సణుగుతూనే ముఖం తీసిచ్చింది.

ఆవిడ ముఖం తగిలించుకుంటూ వుంటే నుదిటిమీద మేకు జారి కిందపడింది. అదీ సంగతి.

గవర్నమెంటు ఉద్యోగంలో చేరేటప్పుడే మేకు కొట్టారన్నమాట. మేకు కాస్త లూజై నాముఖం కాస్తా ఎక్కడో జారిపడిపోయిందన్న మాట. ఆవిడ ముఖం తమాషాగా కనబడింది. బొట్టు, కాటుక, చెవులకి లోలకులు, ముక్కుకి బేసరి–సరే, అర్ధనారీశ్వరుడు లేడా అని సర్దిచెప్పుకుని బయల్దేరాను.

చిత్రం–బస్సులోగాని, దారిలోగాని ఎక్కడా కూడా ఎవరూ నన్ను జూసి నవ్వలేదు. ఎందుకని కాఫీ తీసుకొచ్చి పెట్టాడు. మా బామ్మరిదికి టీ అలవాటులాగుంది– కాఫీకప్పు ముట్టుకోవడంలేదు. సరేనని, పూర్తిగా రాజీపడిపోయి టీకి ఆర్డరిచ్చాను.

వెంటనే కుడిచెయ్యి టీకప్పు ఆప్యాయంగా ఎత్తి పట్టుకుంది. పెదాలవరకీ హుషారుగా తీసుకెళ్ళింది టీ కప్పుని. అంతే–నోరు తెరుచుకోవడంలేదు. పెదాలు విడివడడంలేదు. ఆవిడకి టీ తాగితే నిద్రపట్టదు. ఈ బాధ పడలేక తిరిగి కాఫీ తెప్పించుకుని ఎడంచేత్తో తాగేశాను.

ఇంకా నయం మా బామ్మరిది ఉద్యోగం పత్రికాఫీసుకాబట్టి సరిపోయింది. అబద్ధాలన్నా రాస్తూంది. మావాడు ఏ పోలీసు ఆఫీసరో కాలేదు. ఈ చేత్తో పై వాళ్ళకి సలాంజేసి, కిందివాళ్ళని చావగొట్టి ఇవాళ్ళల్లా ఛండాలప్పన్లన్నీ చేసేవాణ్ణి, అని వూరడించుకొని, ఇంక లాభంలేదని వాడి చెయ్యి వాడికిచ్చేసి వొద్దామని నాకాళ్ళమీద లేచి నిలబడ్డాను. ఇవి నా కాళ్ళేనా? ఇంక అన్నీ అనుమానాలే. సరే ఆవేళ్టికి నాకు సిగరెట్టు తాగే యోగంలేదని ఈపాటికి మీకు తెలిసిపోయుంటుంది. నా బుజాలమీద కూచున్నది మా ఆవిడ ముఖంగదా!

పాత సామాన్లు అవయవాలు అమ్మే మార్కెట్టుకి పోవాలి వొచ్చే ఆదివారం. నాకు సరిపోయే ముఖం, చెయ్యి ఏమన్నా దొరకుతాయేమో కొనుక్కోవచ్చు. అందాకా ఈ బాధ తప్పదు.